మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# ఓటు వేసేందుకు ఏదైనా ఒక ప్రత్యామ్నాయ ధృవీకరణ పత్రంతో వెళ్లండి...

**నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 29 ప్రభాతవార్త:** నేడు నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు గుర్తింపు కార్డుకు ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంక్, తపాల కార్యాలయం జారీ చేసిన ఫోటోతో కూడిన పాస్ బుక్, కేంద్ర కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య భీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, రిజిస్టర్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా(ఆర్జీఐ), నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌ఎఐ) కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్ పోర్టు, ఫోటోతో కూడిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిబేజుల్ గుర్తింపు కార్డు (యూడీఐడీ)లు కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. 12 కార్డులలో ఏదైనా గుర్తింపు కార్డుతో నైనా ఓటు వేయవచ్చునని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## వనపర్తి నియోజకవర్గంలో.. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం..

**296 పోలింగ్ కేంద్రాలు,**
**28 రూట్ల వారీగా ఎన్నికల సామాగ్రితో**
**డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి భద్రతా**
**దళాల తో తరలి వెళ్లిన ఎన్నికల సిబ్బంది**
**జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్**



**వనపర్తి,నవంబర్ 29,ప్రభాతవార్త :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నేడు వనపర్తి నియోజకవర్గంలో జరిగే పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద లాల్ పవార్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఎన్నికల ఏర్పాట్ల పై చిట్యాల మార్కెట్ గోదాములో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో 296 పోలింగ్ కేంద్రాల్లో రేపు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించే విధంగా పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 296 పోలింగ్ స్టేషన్ లకు 28 రూట్ లు 14 కౌంటర్ లు ఏర్పాటు చేసి ఈ రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికల నిబంధనలు తూచ తప్పకుండా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజు సాయంత్రం వరకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకొని అక్కడి రేపటి ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పట్లు చేసుకొని ఉదయాన్నే 5:30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించి అన్ని క్లియర్ చేసిన అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభించి పారదర్శకంగా ముగించాలని సూచించారు. రేపటి ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించు కోవాలని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా నచ్చిన వ్యక్తికి ధైర్యంగా ఓటు వేయాలని మీడియా ముఖంగా జిల్లా ప్రజలను కోరారు.

## ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు..

**జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**
**ఎన్నికలు సజావుగా, ప్రశాంతమైన**
**వాతావరణంలో జరిగేందుకు కృషి చేయాలి**
**ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీస్**
**సిబ్బందికి అవగాహన కార్యక్రమం**



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట ప్రతినిధి,నవంబరు 29 ప్రభాత వార్త:** నేడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి, మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్‌లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి కోస్గిలోని పంచాక్షరి ఫంక్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమం (బ్రీఫింగ్ సెషన్)ను జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్క పోలీస్ అధికారి, సిబ్బంది కృషి చేయాలని అన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఎన్నికల సిబ్బందికి, పారా మిలిటరీ సిబ్బంది వారితో సమన్వయంతో జిల్లా పోలీస్ సిబ్బంది పని చేయాలని అన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు ఉండేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సరిచూసుకోవాలని, ఓటర్లు క్యూలైన్లు పాటించే విధంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహించేవారు, ప్రధానంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గల గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని పలు జాగ్రత్తలు సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై నిఘా పెట్టాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని, ఎవరైనా ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడినట్లయితే తక్షణమే సంబంధిత పై అధికారులకు తెలపాలని అన్నారు. ఓటర్లకు భరోసా కలిగించే విధంగా ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు ఉన్నారు.



హాజరైన పోలీస్ అధికారులు

## సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసి వారిపై చర్యలు తీసుకోండి

**జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**నారాయణపేట ప్రతినిధి,నవంబరు29 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఎస్పీని కలిసిన మక్తల్ కాంగ్రెస్ నాయకులు నిన్న సోషల్ మీడియాలో, ప్రచారం మధ్యమాలలో మాపై కావలి శ్రీహరిపై కొందరు ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిపై ఫేక్ వీడియోలు తయారుచేసి మా మనోభావాలను కించపరిచేలా చేస్తున్నారని అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలుతీసుకోవాలని నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌ని కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్పీని కలిసిన వారిలో కావలి శ్రీహరి, బాలకృష్ణారెడ్డి, జి.గో పాల్‌రెడ్డి, రవికుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# నేడే పోలింగ్..!

- ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటలకు వరకు..
- తేలనున్న 173మంది అభ్యర్థుల భవితవ్యం..
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు
- నిఘా నీడలో పోలింగ్ కేంద్రాలు
- అమలులో 144 సెక్షన్
- ఎన్నికల విధుల్లో కర్ణాటకతోపాటు కేంద్ర బలగాలు






**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 29, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు ఎన్నికలకు సిద్ధమైంది. మంగళవారం సాయంత్రం 5గంటలకు ప్రచారం పరిసమాప్తం కాగా, గురువారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓటే వేసేందుకు ఈసీ అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లాలోని 12నియెజకవర్గాల్లోని 173మంది అభ్యర్థుల బరిలో ఉన్నారు. నేటి సాయంత్రంలో ఈవీంలల్లో అభ్యర్థుల భవితవ్యం భద్రంగా ఉండనున్నది. డిసెంబర్ 3న అభ్యర్థుల తలరాతలు, వారి భవితవ్యం తేలనున్నది. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కల్వకుర్తి, మహబూబ్‌నగర్, మక్తల్ త్రిముఖ పోటీ ఉన్నా మిగతా అన్ని నియోజవకవర్గాల్లో ద్విముఖ పోటీ ఉండనున్నట్లు తెలుస్తున్నది.

**ఎన్నికలకు సర్వం సిద్ధం..** ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జి రవినాయక్ తెలిపారు. ఈమేరకు ఎన్నికల అధికారులకు రెండు రోజుల శిక్షణతోపాటు పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది బుధవారం రాత్రి వరకు పోలింగ్ కేంద్రాలకు తరలారు. ఈవీఎంలతోపాటు వివిధ సామగ్రిని పోలీసుల బలగాల నిఘా నీడలో సెంటర్లకు చేర్చారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలిస్తారు. ఎన్నికల నేపథ్యంలో 144సెక్షన్ అమలులో ఉన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఎన్నికలకు 12రకాల గుర్తింపు కార్డులతో ఓటు వేయవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు.

**నిఘా నీడలో..** ఉమ్మడి జిల్లాలో 144సెక్షన్ అమలులో ఉన్నది.








జిల్లాల్లో పోలింగ్ యంత్రాంగం బలగాలతో పాటు కేంద్ర బలగాలు, కర్ణాటక పోలీసు అధికారులు సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉండనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సివిల్ పోలీస్ బలగాల్లో ఎస్పీలు,ఏఎస్పీలు ఒక్కొక్కరు, డీఎస్పీలు ఐదుగురు, సీఐలు 15, ఎస్సైలు 38 మంది, ఏఎస్సైలు 43 మంది, హెడ్‌కానిస్టేబుళ్లు 104, హోంగార్డులు 220, కానిస్టేబుళ్లు 297 మంది విధుల్లో ఉండనున్నారు. ఏఆర్ ఫోర్సులో ఏఎస్పీ ఇకరు, డీఎస్పీ ఒకరు, ఆర్ఐలు ముగ్గురు, ఆర్ఎస్ఐలు ఆరుగురు, హెడ్ కానిస్టేబుళ్లు 49మంది, కానిస్టేబుళ్లు 150మంది, స్పెషల్ పార్టీ పోలీసులు 30, సీఎపీఎఫ్ 61మంది ఉన్నారు. దీంతోపాటు సీఏపీఎఫ్ 8కంపెనీలు ఒక్కో కంపెనీలో 90మంది, 10బటాలియన్ నుంచి 40మంది ఫోర్స్, కర్ణాటక నుంచి ఒక కంపెనీ, హెచ్‌జీఎస్ నుంచి 750మంది విధుల్లో ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 7,07,753 మంది ఓటర్లు ఉన్నారు. ఆ వివరాలు..

**మహబూబ్‌నగర్ జిల్లాలో ఓటర్ల వివరాలు..**

| నియోజకవర్గం | మహిళలు | పురుషులు | ఇతరులు |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 1,26,499 | 1,25,843 | 13 |
| జడ్చర్ల | 1,09,456 | 1,10,783 | 5 |
| దేవరకద్ర | 1,18,031 | 1,17,123 | 0 |

# పోలింగ్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి..!

**మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జి. రవినాయక్.. నూతన కలెక్టరేట్లో ఎన్నికలపై సమీక్ష..**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి జి.రవినాయక్



సమావేశానికి హాజరైన అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,నవంబరు 29 ప్రభాతవార్త :** రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వచ్చే అన్ని ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.రవినాయక్ ఆదేశించారు. బుధవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, 1950 కాల్ సెంటర్, జిల్లా స్థాయి కంట్రోల్‌రూమ్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్, సోషల్ మీడియా కంట్రోల్ రూమ్‌ల సిబ్బంది, అధికారులతో సమీక్షించారు. 30వ తేదీ నిర్వహించనున్న ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఏదైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే కంట్రోల్ రూమ్‌కి తెలియజేయాలని, అలాగే 1950 నంబర్‌కు వచ్చే ఫిర్యాదులను నమోదు చేసుకుని తక్షణమే పరిష్కరించేలా చూడాలని చెప్పారు. ఇందుకుగాను రెండు అవుట్ గోయింగ్ కాల్స్‌తో పాటు, రెండు ఇన్‌కమింగ్ కాల్స్ ఫెసిలిటి ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలోని కంట్రోల్ రూమ్, సి విజిల్, 1950, సోషల్ మీడియా, మీడియా మానిటరింగ్ అన్ని కంట్రోల్ రూములు పూర్తి అప్రమత్తంగా ఉండి చురుకుగా పని చేయాలని ఆదేశించారు. 24 గంటల విధులకు నియమించబడిన ఉద్యోగులు రిలీవర్ వచ్చిన తర్వాతే విధుల నుండి రిలీవ్ కావాలని, అప్పటివరకు విధులు నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ స్టేషన్ లోపల, బయట జరిగే సంఘటనలకు సంబంధించి ఖచ్చితంగా సమాచారాన్ని సంబంధిత రిటర్నింగ్ అధికారులు, పిఓ, సెక్టార్ ఆఫీసర్ల ద్వారా పూర్తిగా నిర్ధారణ చేసుకున్న తర్వాతే ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కంట్రోల్ రూమ్‌లు, ముఖ్యంగా సోషల్ మీడియా మానిటరింగ్‌పై ఉందని చెప్పారు. కంట్రోల్ రూమ్‌లో పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఎంపిడిఓ, తహసిల్దార్ అందరి ఫోన్ నంబర్లతో సహా డేటాను నిర్వహించాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులు 10 నిమిషాలలోపే స్పందించి సరైన సమాచారాన్ని పంపించాల్సి ఉంటుందని ఆదేశించారు. ఎన్‌కోర్ ద్వారా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, రిపోర్టులు అన్నింటిని జాప్యం లేకుండా అందులో సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ముఖ్యంగా పోలింగ్ శాతానికి సంబంధించి ఓటర్ టర్న్ అవుట్, కంట్రోల్ రూమ్ అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా అంకెలను తెలియజేయాలని చెప్పారు. ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి సమాచారం అందినప్పుడు తక్షణమే వివిధ నోడల్ అధికారులు బృందాలతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు చేపట్టేలా పని చేయాలన్నారు. అన్ని బృందాలు పూర్తి అప్రమత్తంగా ఉండి పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీ సంఘటనలు, ఇబ్బందులు పెట్టకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 1950, సి.విజిల్, జిల్లా కమ్యూనికేషన్ ప్లాన్, సోషల్ మీడియా, మీడియా సర్టిఫికేషన్ నోడల్ అధికారులు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఈ సమావేశానికి హాజరయ్యారు.

# జిల్లాలోని 3 నియోజకవర్గాల్లో రేపటి అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం..!

**-802 పోలింగ్ కేంద్రాలు, 87 రూట్ల వారీగా ఎన్నికల సామాగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి భద్రతా దళాలతో తరలివెళ్లిన ఎన్నికల సిబ్బంది**
**-పోలింగ్ అనంతరం నాగర్‌కర్నూల్ నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రీసివింగ్ కేంద్రానికి చేరుకోవాలి**
**-3వ తేదీ కౌటింగ్‌కు పక్కా ఏర్పాట్లు**
**-595 కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు**
**-కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి నేరుగా పర్యవేక్షణ**



డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు హజరైన అధికారులు



ఈవీఎం, వీవీప్యాట్‌లను డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్



ఎన్నికల పంపిణీకి తరలివెళ్తున్న ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నేడు నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్,కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లో 802 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. బుధారం ఆయన నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్‌లో ఎన్నికల ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని 3 నియోజకవర్గాల్లో 802 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహించే విధంగా పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 802 పోలింగ్ స్టేషన్లకు 87 రూట్‌లు నియోజకవర్గాల్లో కౌంటర్‌లు ఏర్పాటు చేసి బుధవారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికల నిబంధనల ప్రకారం అన్ని మెటిరీయల్, ఈవీఎంలు తీసుకొని భద్రత దళాలకు కట్టుదిట్టమైన భద్రత మధ్య రూట్ల వారిగా పంపించారు. ఎన్నికల సిబ్బంది ఎన్నికల నిబంధనలు తూచ తప ్పకుంఆ పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. సాయంత్రం వరకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకొని అక్కడి నుంచి నేడు నిర్వహించే ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకొని ఉదయాన్నే 5.30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించి అన్ని క్లీయర్ చేసిన అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభించి పారదర్శకంగా ముగించాలని సూచించారు. 595 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 194, అచ్చంపేటలో 199, కొల్లాపూర్‌లో 202 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 449 సమస్యాత్మాక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 168, అచ్చంపేటలో 145, కొల్లాపూర్‌లో 136 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మాక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన రిసీవింగ్ సెంటర్‌కు అధికారికంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారానే తరలి రావాలని సూచించారు. డిసెంబర్ 3వ తేదీకి కౌంటింగ్ ప్రక్రియకు పకడ్భంది ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నేటి ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలాభోలకు గురికాకుండా నిష్పక్షపాతంగా నచ్చిన వ్యక్తికి ధైర్యంగా ఓటు వేయాలని జిల్లా ప్రజలను కలెక్టర్ కోరారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల అబ్జర్వర్లు మిథిలేష్ మిశ్రా, భేరా రామ్‌చౌదరి, సతీష్‌కుమార్‌ల పర్యవేక్షణలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. నాగర్‌కర్నూల్ రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి, కొల్లాపూర్ రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్, అచ్చంపేట రిటర్నింగ్ అధికారి గోపిరామ్, ఇతర ఎన్నికల పర్యవేక్షణ నోడల్ అధికారులు తదితరులు ఉన్నారు.



పోలింగ్ బూత్‌లకు తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది

## సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోండి

● జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఎస్పీని కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 29 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాఎస్పీని కలిసిన మక్తల్‌కాంగ్రెస్ నాయకులు నిన్న సోషల్ మీడియా లో, ప్రచారం మధ్యమాలలో మాపై కావలి శ్రీహరిపై కొందరు ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై ఫేక్ వీడియోలు తయారు చేసి మా మనోభావాలను కించపరిచేలా చేస్తున్నారని అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌ని కలిసిఫిర్యాదు చేశారు. ఎస్పీని కలిసినవారిలో కావలి శ్రీహరి, బాలకృష్ణారెడ్డి, జి.గోపాల్‌రెడ్డి, రవికుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## ఎన్నికలకు రంగం సిద్ధం



నేడు జరగబోయే పోలింగ్‌కు ఏర్పాట్లు చేసిన దృశ్యం

**మాగనూరు,నవంబరు29 ప్రభాతవార్త:** మాగనూరు మండలంలోని అన్ని గ్రామాలలో జరగబోయే ఎన్నికలకు ఓటర్లకు కావలసినటువంటి సదుపాయాలన్ని కూడా సర్వం సిద్ధం చేయడం జరిగిందని నేడు జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు పాల్గొని ఓటుహక్కును వినియోగించుకోవాలని ఇందుకు సంబంధించినటువంటి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందని, మండలంలోని 25 బూతులకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందని ఎంపిడిఓ తెలిపారు. మాగనూరు గ్రామంలో ఉన్న హైస్కూల్లో పండగ వాతావరణం నెలకొల్పేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**వెల్దండ, నవంబర్ 29 ప్రభాతవార్త:** మండల పరిధి లోని అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ సర్వం సిద్ధం చేసిన ట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో పోలింగ్ బూత్‌ల సంఖ్య 35కు గాను 124వ పోలింగ్ బూత్ కొత్త మోడల్, 151 మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 33,039 మంది ఓటర్లు ఉన్నారని, ఒక్కో పోలింగ్ బూత్‌కు నలుగురు అధికారులను నియమించినట్లు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద144 సెక్షన్‌అమలులో ఉంటుందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు.

## చర్చనీయాంశంగా రాయదుర్గం డబ్బుల వ్యవహారం



పట్టుబడ్డ డబ్బులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్29, ప్రభాతవార్త:** రాయదుర్గం స్టేషన్ పరిధిలో రూ.1.68కోట్లు పట్టుబడడంతో జడ్చర్లలో చర్చనీయాంశంగా మారింది. నగదు జడ్చర్ల కాంగ్రెస్ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి చెందినవిగా ఎన్నికల అధికారితోపాటు పోలీసులు కూడా నిర్ధారించడంతో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ నాయకులు మధ్యం చర్చ సాగింది. కౌంటర్లు, ఎదురు కౌంటర్లు వేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేసుకోవడం చర్చకు దారితీసింది. హైదరాబాద్‌లోని ఖాజగూడలోని గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ నుంచి నగదు తరలిస్తుండగా పట్టుబడడంతో అనిరుధ్‌రెడ్డి కోసం తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించినట్లు సమచారం, అయితే తనను జడ్చర్ల బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి తనను హౌజ్ అరెస్ట్ చేయించాడంటూ బుధవారం ఒక వీడియో రిలీజ్ చేయడం దుమారం లేపింది. జడ్చర్ల నియోజకవర్గంలో ఉండాల్సిన అభ్యర్థి అనిరుధ్‌రెడ్డికి హైదరాబాద్‌లో ఏం పని, డబ్బులు తీసుకరావడానికే హైదరాబాద్ వెళ్లారంటూ ఎదురు కౌంటర్లు వేయడం చర్చకు దారిసింది.

## జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సి.విజిల్ ఏర్పాటు



పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు29 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సి విజిల్, 1950 జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్, మీడియా సర్టిఫికేషన్, సోషల్ మీడియా కంట్రోల్ రూమ్‌లు పోలింగ్ రోజున పూర్తి అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టర్ కార్యా లయంలోని సివిజిల్,1950, మీడియా సర్టిఫికేషన్, సోషల్ మీడియా కంట్రోల్ రూమ్ వెబ్ క్యాస్టింగ్‌లను తనిఖీ చేశారు. పోలింగ్ రోజుఇచ్చే వివిధ రకాల నివేదికలు, ఫిర్యాదుల విభాగాలు చురుకుగా పనిచేస్తూ ఎప్పటి సమాచారం అప్పుడే పంపించేందుకు చేసిన ఏర్పాట్లు ఆయన పరిశీ లించారు. ఎస్‌డిసి రాజేందర్‌గౌడ్, అధికారులు తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్



పోలింగ్‌కు సిద్ధం చేసిన దృశ్యం

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

● మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జి.రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో,నవంబరు29 ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల పోలింగ్ గురువారం నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రవినాయక్ తెలిపారు. బుధవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజక వర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణ విషయమై పోలింగ్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, పోలింగ్ కేంద్రాలకు రాండమైజేషన్ ప్రకారం వారిని కేటాయించడం జరిగిందని, పోలింగ్ సామాగ్రితో పాటు, సెక్టార్ వారిగా పంపిణీ చేశామని, వారు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవసరమైన



ఎన్నికల సిబ్బందితో అధికారులు




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి జి. రవినాయక్

వాహనాలను కూడా ఏర్పాటు చేశామని, సెక్టోరల్ అధికారుల ఆధ్వర్యంలో వారు సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్లడం జరిగిందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది ముందుగా పిఓ, ఏపిఓ సిట్టింగ్‌లతో పాటు ఓటింగ్ కంపార్టుమెంట్ అన్ని చూసుకోవడం జరుగుతుందని, పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు చేశామని చెప్పారు. పట్ట ప్రాంతాలలో ఓటర్ టర్న్‌అవుట్ పెంచేందుకు అన్నిచర్యలు చేపట్టామని, ఓటరు సమాచార స్లిప్పులను 96.5 ఇవ్వడం జరిగిందని తెలిపారు. కొత్తగా లక్షయాభై మూడు వేల ఓటరు గుర్తింపు కార్డులు రాగా వాటినన్నింటిని నూతన ఓటర్లకు పంపిణీ చేశామని తెలిపారు. పోలింగ్ రోజు ఓటు వేసేందుకుఓటర్లు 12రకాల డాక్యుమెంట్లలో ఏదోఒకదాన్ని గుర్తింపుగా చూయించి ఓటు వేయాలని జిల్లాలోని అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ మాట్లాడారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రతో కలిసి పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలింగ్‌ను నిర్వహించాలని కోరారు. పోలింగ్ నిర్వహణలోపూర్తి జాగ్రత్తలుపాటించాల్సిందిగా వారు పునరుద్ఘాటించారు.

## పోలింగ్‌కు సర్వం సిద్ధం

● పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

● సమస్యాత్మక కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు

● 60 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు

**చిన్నచింతకుంట,నవంబరు29 ప్రభాతవార్త:** నేడు జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలలో సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల జోనల్ అధికారులు తెలిపారు. మండలంలో 36 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో చిన్నచింతకుంటలోని (6) అమ్మాపూర్‌లో (2), ముచ్చింతలలో (2) పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. వెయ్యిలోపు ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఒక ప్రొసీడింగ్ అధికారి, ఎపిఓతో పాటు ఇద్దరు ఎన్నికల సిబ్బంది ఉంటారు. 1000కు పైగా ఉన్న ఓట్లు కలిగిన పోలింగ్ కేంద్రాలలో ఐదుగురు పోలింగ్ అధికారులు ఉంటారని ఎన్నికల జోనల్ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రానికి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఈవిఎంలతో పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు.

**పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు...**

మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. 36 పోలింగ్ కేంద్రాలలో 60 మంది పోలీసులతో బందోబస్తు చేపడుతున్నట్లు ఎస్సై ఆర్.శేఖర్ తెలిపారు. రూట్ మొబైల్ టీం, సిఐ ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్‌తో పాటు డీఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో స్పెషల్ ట్రైనింగ్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారని తెలిపారు. మండలంలో ఐదు మొబైల్ టీంలు, ఆర్మీ స్పెషల్ ఫోర్స్ ఉంటారని ఎస్సై తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.



పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది

## నేడు జరగబోవు ఎన్నికలకు భారీ బందోబస్తు

**వనపర్తి,వనంబర్ 29,ప్రభాతవార్త:** నేడు జరగబోవు తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సజావుగా సాగేలా పోలీస్ శాఖ తరపున జిల్లా ఎస్పీ తగు అన్ని చర్యలను చేపట్టారు. వనపర్తి జిల్లాకు ఇప్పటికి సెంట్రల్ అర్మడ్ పోలీస్ ఫోర్స్ బలగాలు 02 కంపెనీలలో 182,ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఆర్మ్మార్ పోలీస్ 7 కం పెనీలు సిబ్బంది 716 మంది వీచ్చేసారు. కర్ణాటక పోలీసులు 450 మంది సిబ్బంది,సీఐడీ హైదరాబాద్ నుండి 11 అదే విధంగా వనపర్తి జిల్లా పోలీసు విభాగంలో 470 మంది మొత్తం 1892 సిబ్బదితో ఎలక్షన్ విధులను కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...వనపర్తి జిల్లాలో మొత్తం 542 పోలింగ్ కేంద్రాలు,339 పోలింగ్‌లోకేషన్స్ ఉన్నాయని వీటిలో సాధారణ, సమ స్యత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలు గా విభజించామని దానికి అను గుణంగా భద్రత చర్యలు చేపట్టామని తెలియచేసారు. వనపర్తి జిల్లాలో ఎన్నికలలో ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రత్యేకమైన యాక్షన్ ఫ్లాన్ తో ముందుకు వెళ్తున్నామని పోలింగ్ కేంద్రాల చుట్టూ మూడంచల భద్ర త వ్యవస్థ పొందు పరిచామని దీనిలో భాగంగా జిల్లా స్పెషల్ పార్టీ, సెంట్రల్ అర్మడ్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ లచే గస్తీ నిర్వహిస్తున్నామని తెలి య చేసారు. మారు మూల గ్రామాలకు ఈవీఎంల తరలింపులో భాగంగా ఎలువంటి ఆటంకం



రాకుండా ఆకస్మిక వాహనాల తనిఖీ,బైక్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని ఇందులోభాగంగా ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్5, స్ట్రైకింగ్ ఫోర్స్15, టీములుగా విభజించామని వీటిలో భాగంగా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంతో పాటుఅనుకోనిసంఘటన సంభవిస్తే దాన్ని ప్రతిఘటించేలా క్విక్ రియాక్షన్ టీంను ఏర్పాటు చేశామని ఇప్పటికే ప్రతి ఒక్క టీంతమ తమస్థానాల లో విధులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ఎస్పీ తెలియజేశారు.

## ఆర్యవైశ్యులపై దాడి హేయమైన చర్య

**కల్వకుర్తి, నవంబర్ 29 ప్రభాతవార్త:** తమ పని తాము చేసుకుపోయే ఆర్యవైశ్యులను సమాజంలో కొంత మంది చిన్న చూపు చూస్తుంటారని, బుధవారం కల్వకుర్తి పట్టణంలో మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకులు బొమ్మ ఆంజనేయులుపై మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం అకారణంగా దాడి చేయడం హేయమైన చర్య అని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రకటించారు. బుధవారం కల్వకుర్తిలో సంఘం నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు ఆంజనేయులు మాట్లాడుతూ తాను ఎవరిని ఎమి అనలేదని, అనవసరంగా ఛైర్మన్ తన వద్దకు వచ్చి బూతులు తిడుతూ దాడి చేస్తూ కులం పేరుతో దూషించి మీకేందుకురా రాజకీయాలంటూ అపహాస్యం చేశారని, ఇంతటితో వదలకుండా తనఇంటి వద్దకు వచ్చి ఇంట్లో ఉన్న నాభార్యను అసభ్య పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈదుర్ఘటనపై పోలీసులకు ఫిర్యాదుచేశా మన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూమేము చేతులు ముడుచుకొని కూర్చొలేదన్నారు. దేనికైన సిద్ధంగా ఉంటామని, మరోసారి వైశ్యుల జోలికి వస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. దానికి నిరసన గా పట్టణంలోని ఆర్యవైశ్యులు తమషాపులను 3గంటల పాటు మూసి ఉంచి నిరసన వ్యక్తంచేశారు. సమావేశంలో ఆర్యవైశ్యసంఘం మండల మాజీ అధ్యక్షులు శివాలయంశ్రీనివాస్, శేఖర్, వజ్రలింగం, గంపశ్రీనివాస్, సింహ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్యులు

య్య, ముత్యాలు, రఘుప్రసాద్, చిగుళ్లపల్లి సతీష్ తదితరులు ఉన్నారు.

**వైశ్యులపై భౌతికంగా దాడులకు పాల్పడటం సరైంది కాదు...**

సమాజంలో ఒకరికి మేలు చేసే సదుద్ధేశ్యంతో ఉండే వైశ్యులపై కక్ష కట్టి భౌతికంగా దాడులకు పాల్పడటం సరైంది కాదని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో మాజీ వైస్ ఎంపీపీ బొమ్మ ఆంజనేయులుపై జరిగిన దాడి ఘటనను జిల్లా ఆర్యవైశ్య మహాసభ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎవరికి నచ్చిన పార్టీకి వారు మద్దతు తెలుపుతారని, రాజకీయాలు స్నేహపూర్వకంగా ఉండాలి కానీ ఘర్షణలకు పాల్పడేలా ఉండకూడదన్నారు. వైశ్యులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

## నేడే 2023 శాసనసభ ఎన్నికలకు పోలింగ్

● అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

● నియోజకవర్గంలో 262 పోలింగ్ కేంద్రాలు

**కల్వకుర్తి, నవంబర్29,ప్రభాతవార్త:** నేడు గురువారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శాసనసభ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనునాయక్ తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనునాయక్ ఏర్పాట్లను పూర్తి చేశారు. 262 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ఎన్నికల అధికారి, మరో సహాయ ఎన్నికల అధికారితో పాటు ఇద్దరు అదనపు సిబ్బందిని కలుపుకొని సుమారు 1726 మంది పోలింగ్ సిబ్బంది, 417 మంది పోలీస్ సిబ్బంది ఎన్నికల విధులను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 328 ఈవీఎం మిషన్లతో పాటు అదనంగా మరో 66 ఈవీఎంలను అందుబాటులో ఉంచామని ఆయన పేర్కొన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో ఈవిఎం మిషన్లలో సాంకేతిక లోపాలు ఏర్పడితే వెంటనే సిబ్బంది సరిచేసేందుకు, మార్చేందుకు సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ఒక పీఓ, ఏపీఓ, ఇద్దరు ఓపీఓలు, వెబ్ కాస్టింగ్, ఇద్దరు వాలంటీర్లు, బీవోలు, ఆరోగ్య పరంగా ఇబ్బంది



పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

ఉన్నవారి కోసంపీడబ్ల్యూడీ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం సాయంత్రం అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో పాటు సిబ్బంది చేరుకుంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనునాయక్‌మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాల్లో, గ్రామాల్లో ఎన్నికల విధులు నిర్వహించే క్రమంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి రవినాయక్

● మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు



మోడల్ పోలింగ్ స్టేషన్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 29,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సి విజిల్, 1950, జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్, మీడియా సర్టిఫికేషన్, మరి సోషల్ మీడియా కంట్రోల్ రూంలు పోలింగ్ రోజున పూర్తి అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడుసమాచారాన్ని పంపించాలని జిల్లాకలెక్టర్ జి రవినాయక్ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో సి విజిల్, 1950, మీడియా సర్టిఫికేషన్ సోషల్ మీడియా కంట్రోల్ రూమ్ వెబ్ క్యాస్టింగ్‌లను తనిఖీ చేశారు. పోలింగ్‌రోజు ఇచ్చే వివిధ రకాల నివేదికలు ఫిర్యాదుల విభాగాలు చురుగ్గా పనిచేస్తూ ఎప్పటి సమాచారం అప్పుడే పంపిచేందుకు చూసిన ఏర్పాట్లు అయన పరిశీలించారు.

**మోడల్ పోలింగ్ స్టేషన్:** ఓటర్లను ఆకర్షించేందుకు అధికార యంత్రాంగం మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులతోపాటుఆకర్షించేలా తయారు చేశారు. గుండేడ్, బాలానగర్, రామచంద్రాపూర్, నర్సింగాపురం, మదనాపురం, నవాబుపేటలో మోడల్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అందరినీ ఆకర్షించేలా రంగు రంగుల కాగితాలు, బెలూన్లతో పూలమాలలు వేసి ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేశారు.



మోడల్ పోలింగ్ స్టేషన్లు

## పార్కుల సందర్శనకు రావద్దు

**మహబూబ్‌నగర్ బ్యూరో,నవంబరు 29 ప్రభాతవార్త:** రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 30న పిల్లలమర్రి పర్యాటక కేంద్రం, అలాగే కెసిఆర్ ఎకో అర్బన్ పార్కులకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి యు.వెంకటేశ్వర్లు, జిల్లా అటవిశాఖ అధికారి సత్యనారాయణలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ రెండు పర్యాటక కేంద్రాలు గురువారం మూసి ఉంటాయని, అందువల్ల పర్యాటకులు 30వ తేదీ పిల్లలమర్రి, కెసిఆర్ ఎకో అర్బన్ పార్కులకు సందర్శనకు రావద్దని వారు విజ్ఞప్తి చేశారు.








## పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి









నేలబారిన కంది పంట

## మండలంలో రాత్రి భారీ వర్షం

### నేల రాలిన పంటలు.. ఎగిరిపోయిన రేకులు

### ఆదుకోవాలని రైతుల వేడుకోలు

**న్యాల్‌కల్, నవంబరు 29, ప్రభాతవార్త:** మంగళవారం రాత్రి కురుసిన భారీ వర్షాలకు, వీచిన ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాలు అతలాకుతలం అయ్యాయి. ఈదురు గాలులతో కూడి భారీ వర్షం కురు స్తుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు పాట్లు పాడాల్సి వచ్చింది. ఇండ్లలో అవస్థలు పడుతున్న ప్రజలకు పుండు మీద కారం చల్లి న చందంగా అష్టకష్టాలు పడి పండిస్తున్న పంటలు చేతికొస్తున్న తరుణంలో అకాల వర్షాలకు నేలపాలయ్యాయి. రైతులు పండిస్తున్న పత్తి పంటను రైతులు తెంపుకునే పనిలో ఉన్నారు. ఈ పాటికే తెంపి కుప్పలు పెట్టిన పత్తి గాలి వానలకు పాడవగా, పొలంలో ఉన్న పత్తి పంట నీటితో తడిసి నల్లబారింది. పూత దశలో ఉన్న కంది పంట ఈదురు గాలులకు, వర్షాల కు పూత నేలపాయింది. ఇండ్ల ముందు, ఇండ్లపై ఉన్న రేకులు, గ్రామం తో పాటు గ్రామ శివారులోని చెట్లు నేలకొరిగాయి. మంగళవారం రాత్రి మొత్తం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు ఆయా గ్రామాల్లో ప్రజల కు కునుకు లేకుండా పోయింది. అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు అధికారులు పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని మండల ప్రజలు వినతి చేస్తున్నారు.

### అకాల వర్షాలు.. అవస్థలు పడ్డ రైతన్నలు



అకాల వర్షాలకు తడిచి ముద్దయిన వరి ధాన్యం

**పుల్కల్, నవంబరు 29, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసన అకాల వర్షాలకు ప్రజలు పరేషాన్ అయ్యారు. చౌటకూరు మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు ఆరుగాలం కష్టించి పండించుకుంటున్న వరిని కోత కోసి రోడ్లపై ఆరపె ట్టుకోవడం, రాత్రికి రాత్రి భారీగా వర్షం కురియడంతో ధాన్యం తడిసి ముద్దయింది. అకాల వర్షాలకు అవస్థలు పడ్డ రైతన్నలను అధికారులు ఆదుకోవాలని రైతులు వినతి చేస్తున్నారు.

## హుస్నాబాద్ అభివృద్ధికి దిక్సూచి ఈ శాసనసభ ఎన్నికలు

### మరో సారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా

### ఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి,ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్,నవంబరు29,ప్రభాతవార్త** హుస్నాబాద్ అభివృద్ధికి దిక్సూచి నేడు జరిగే శాసనసభ ఎన్నికలు అని బిఆర్ఎస్ పార్టీ అభ్య ర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్ల ఈ ప్రాంత ప్రజలు రెండు సార్లు ఆశీర్వదిస్తే అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేశానన్నారు. బుధవారం జరిగే ఈ ఎన్నికలు నియోజకవర్గ భవిష్యత్తును ఈ ఎన్నికలు నిర్దేశించనున్నాయన్నారు. బిఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలు వాశ్వసిస్తున్నారన్నారు. చేసిన అభివృద్ధి పనులను చూసి ప్రజలు తన ను మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తారనే నమ్మకం ఉందన్నారు.

### పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న అధికారులు



రాజారాం తండ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న అధికారులు

**కంగ్టి, నవంబరు 29, ప్రభాతవార్త:** శాసన సభ ఎన్నికలను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు ఎన్నికల సామాగ్రితో పోలీసుల బందోబస్తు మధ్య చేరుకున్నారు. మండలంలోని రాజారామ్ తండాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి నలుగురు అధికారులు హాజరయినట్లు తండా పంచాయితీ అధికారి రాజు తెలిపారు.

### సంక్షేమాభివృద్ధి పథకాలతోనే యాదయ్య గెలుపు

**షాబాద్, నవంబర్ 29, ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమాభివృద్ధి పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య గెలుపుకు దోహదపడుతాయని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్‌లో మాట్లాడుతూ....అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు రూపొందించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలకు మోసపోకుండా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే ప్రజల జీవితాల్లో అంధకారమే మిగులుతుందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో ఈ ప్రాంతం తాగునీరు, సాగునీరు అందుతాయన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు కూడా కేసీఆరే ప్రవేశపెట్టి విజయవంతంగా పూర్తి చేశారన్నారు.

### కాంగ్రెస్ ఆరు గ్యారంటిలే భీం భరత్‌ను గెలిపిస్తాయి

**షాబాద్, నవంబర్ 29, ప్రభాతవార్త :**
కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటిలే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీం భరత్ గెలుపుకు దోహదం చేస్తాయని షాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మహిళా మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు అశ్వినీలు అన్నారు. బుధవారం వారు షాబాద్‌లో మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కాంగ్రెస్ ఆరు గ్యారంటిలతో అన్ని వర్గాలకు లబ్ది చేకూరుతుందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.2500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే వంటగ్యాస్ అందజేస్తామన్నారు.ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సహాయం, ఉద్యమకారులకు 250చ.గజాల ఇంటి స్థలాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. యువవికాసం ద్వారా విద్యార్థులకు రూ.5లక్షల విద్యా భరోసా కార్డు ప్రతి మండల కేంద్రంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు

### - ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రావు
### - పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సామాగ్రి

**తాండూరు, నవంబరు 29, ప్రభాతవార్త :**
తాండూరులో అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. తాండూరు నియోజకవర్గంలో మొత్తం 23 రూట్లలో 269 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం తాండూరులోని సెంట్‌మార్క్స్ స్కూల్‌లో తాండూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి ఈవిఎం, వివిప్యాట్‌లతో పాటు ఎన్నికల సామాగ్రిని అందజేశారు. సాయంత్రం వరకు పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఎన్నికల సామాగ్రితో ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన ప్రత్యేక వాహనాలలో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఈ సందర్బంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. తాండూరు అసెంబ్లీ పరిధిలో నిర్వహిస్తున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుందని చెప్పారు. 269 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 23మంది సెక్టోరల్ అధికారులు, 23మంది రూట్ ఆఫీసర్లు, 269మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అదనంగా 41మంది అధికారులతో పాటు 269మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, అదనపు సహాయ అధికారులుగా మరో 39మందిని నియమించడం జరిగిందని వివరించారు. వారితో పాటు 54మంది సూక్ష్మ పరిశీలక బృదం, 173మంది వెబ్ కాస్టింగ్ సిబ్బంది, 18 ప్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 10స్టాటిస్టిక్ బృందాలు, వీడియో సర్వేలైన్, వీడియో మీ వింగ్, అకౌంటింగ్ బృందాలను, 155మందితో పోలింగ్ పోలింగ్ నోడల్ అధికారుల బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రంలో ఈవిఎంలు పనిచేయకపోతే ప్రత్యామ్నాయంగా ఈవిఎంలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



ఎన్నికల సామాగ్రి తీసుకువెళ్లేందుకు వచ్చిన ఎన్నికల సిబ్బంది

దీంతో పాటు సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ ద్వార చిత్రీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందకు సిసి కెమెరాలతో గట్టి నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికలు ప్రశాతంగా జరిగేందకు ఓటర్లు సహాకరించాలని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

**పకడ్బందీగా పోలీసు బందోబస్తు : జిల్లా అడిషనల్ ఎస్పీ మురళీధర్**
తాండూరు నియోజకవర్గంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా అడిషనల్ ఎస్పీ మురళీధర్ తెలిపారు. బుధవారం తాండూరులో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరగిందని తెలిపారు. పోలింగ్



పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది

సందర్బంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు. సుమారు 400మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏఎస్పీ, డిఎస్పీలతో పాటు 23 రూట్లలో పోలీసు అధికారులు, మోబైల్ బృందాలను నియమించడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రత్యేక బలగాలు విదుల్లో ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తాండూరు డిఎస్పీ శేఖర్‌గౌడ్, రూరల్ సీఐ రాంబాబు తదితరులు ఉన్నారు.

## ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**పరిగి నవంబరు29,ప్రభాతవార్త :**
పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నారాయణ రెడ్డి పోలింగ్ అధికారులకు సూచించారు.బుధవారం పరిగి క్రికెట్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పోలింగ్ విధులను నిర్వహించే అధికారులందరూ సమిష్టిగా పనిచేసి పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.పోలింగ్ సామాగ్రిని తీసుకెళ్లిన వెంటనే తమ పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను సమకూర్చుకోవాలని తెలిపారు.ఏవైనా సమస్యలు ఉంటే నోడల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు.పోలింగ్ రోజున సిబ్బంది ఉదయం ఐదు గంటలకు కేంద్రాల్లో ఉండాలని తెలిపారు.ఉదయం 5 : 30 గంటలకు మాక్ పోలింగ్ కచ్చితంగా నిర్వహించాలని మాక్ అనంతరం సిఆర్సి చేసి,వి ప్యాట్‌ల నుండి స్లిప్‌లను తొలగించి మాక్ పోలింగ్ సరిఫికెట్ ఇవ్వాలని తెలిపారు.ఉదయం ఏడు గంటలకు తప్పనిసరిగా పోలింగ్‌ను మొదలు పెట్టాలని ,పోలింగ్ క్రమంలో రెండు గంటలకు ఒకసారి చొప్పున కచ్చితమైన రిపోర్టును ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఎటువంటి తప్పిదాలు జరగకుండా ఏమైనా సమస్యలు ఉంటే సెక్టోరల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.రిపోలింగ్‌కు ఆస్కారం లేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.పోలింగ్ ప్రక్రియలు ఏవైనా సందేహాలు ఉంటే



మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల కమిషన్ ఇచ్చిన హ్యాండ్ బుక్‌ను చదువుకుంటూ పనిచేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న వివిధ శాఖలు కూడా అప్రమత్తంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ తెలిపారు.పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను సాధారణ ఎన్నికల పరిశీలకులు సుధాకర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పరిగి రిటర్నింగ్ అధికారి విజయ కుమారి,డివైఎస్ఓ హనుమంతు రావు,ఎస్సీ కార్పొరేషన్ ఇడి బాబు మోజెస్,తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం

### -ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కును ఉపయోగించుకోవాలి

**కొత్తూర్, నవంబర్ 29, ప్రభాతవార్త :**
నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఈవీఎం ప్యాడ్‌లతో పాటు అన్ని ఏర్పాట్లు ఎన్నికల సంఘం అధికారులు ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా, ఇబ్బందులు లేకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సిద్ధమయ్యేలా, ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. కొత్తూర్ మండలంలో మొత్తం 27పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో శరత్‌చంద్రబాబు తెలిపారు. బూత్‌లు కొత్తూర్ మున్సిపాలిటి హై స్కూల్ 5ఎంఆర్‌సీ భవన్ 1, తిమ్మాపూర్ 1, తిమ్మాపూర్ స్టేషన్1, కుమ్మరిగూడ 1, తీగాపూర్ 1, మల్లాపూర్ 2, గూడూర్ 2,సిద్ధాపూర్ 2, ఎస్‌బిపల్లి 2, కోడిచెర్ల 2, పెంజర్ల 2, వైఎం తాండ 1, ఇన్ముల్‌నర్వ 4 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓటు వేయడానికి తప్పనిసరిగా ఫోటోతో కూడిన గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఓటర్ స్లిప్ పోలింగ్ కేంద్రం, ఓటర్ల జాబితాలో క్రమ సంఖ్య ఈజీగా గుర్తించడానికి మాత్రమేనన్నారు. ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఓటరు ఫోటో గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటోతో ఉన్న బ్యాంక్ లేదా పోస్ట్ ఆఫీస్ అకౌంట్ బుక్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసే ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, మీ ఫోటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జారీ చేసే ఫోటోతో కూడిన గుర్తింపు కార్డు, ఏ ఒక్కటైన మీ వెంట తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. ఒకవేళ ప్రత్యేక వైకల్యం కలిగిన దివ్యాంగులైతే కేంద్ర న్యాయ సాధికారిక మంత్రిత్వ శాఖ జారీ చేసే యూనిట్ డిజిటల్ గుర్తింపు కార్డు ఉంటే సరిపోతుందన్నారు.

**ఎన్నికలు సాఫీగా సాగాలి : ఇన్స్పెక్టర్ శంకర్‌రెడ్డి**
ఎన్నికలు సాఫీగా జరగడానికి కట్టుదిట్టంగా అన్ని ఏర్పాట్లు చేశామని కొత్తూర్ ఇన్స్పెక్టర్ శంకర్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎన్నికలు సాఫీగా జరగడానికి అన్ని విధాలుగా పోలీస్ భద్రత ఏర్పాటు చేశామన్నారు.

## ఆమనగల్లు మండలంలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

**ఆమనగల్లు, నవంబర్29, ప్రభాతవార్త:**
గురువారం జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటింగ్ కేంద్రాలకు కావలసిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం సాయంత్రం నుండి పోలింగ్ కేంద్రాల సిబ్బంది ఆయా కేంద్రాలకు సామాగ్రితో చేరుకున్నారు. కాగా ఆమనగల్లు మండలంలో మొత్తం 31184 మంది ఓటర్లు ఓటు వినియోగించుకునేందుకు మొత్తం 35 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆమనగల్లు మండలంలో పోలింగ్ కేంద్రం సంఖ్య 171 నుండి 205 వరకు ఉన్నాయి. 171 మండల పరిషత్ పెద్దతండా, 172 కోనాపూర్, 173 విఠాయి పల్లి, 174 చింతలపల్లి, 175 మేడిగడ్డ, 176 మంగళపల్లి, 177, 178, 179, 180, 184, 185, 188, 189 ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆమనగల్లు, 181,182 ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆమనగల్లు, 183 భవిత భవనం మండల పరిషత్ ప్రాంగణం, 186 మండల ఎడ్యుకేషన్ రిసెర్చ్ ఆమనగల్లు, 187 ఎంపీపీ భవనం ఆమనగల్లు, 190, 191 మేడిగడ్డ తండా, 192 సింగంపల్లి , 193, 194 పోలెపల్లి, 195 చెన్నంపల్లి, 196, 197 జంగారెడ్డి పల్లి, 198, 199 ముర్తుజపల్లి, 200,201,202 ఆకుతోటపల్లి, 203 సీతారాం నగర్‌తండా, 204, 205 శెట్టిపల్లి గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా మండల వ్యాప్తంగా మొత్తం 31184 ఓటర్లు ఉండగా అందులో మహిళలు 15534 మంది కాగా పురుషులు 15650 మంది ఓటర్లు ఉన్నారు.

**సిఖి పోలింగ్ కేంద్రం....**




ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో సఖీ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ శ్యాంసుందర్

ఆమనగల్లు మండలంలో సఖీ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ కమీషనర్ శ్యాంసుందర్ పర్యవేక్షణలో ఆకట్టుకునేలా రూపొందించారు. బెలూన్‌లతో ముఖ ద్వారాన్ని అలంకరించడమే కాకుండా పోలింగ్ కేంద్రం లోపల చూడముచ్చటగా డెకరేషన్ చేశారు. సఖీ కేంద్రంలో పూర్తిగా సిబ్బందంతా మహిళా అధికారిణిలే ఎన్నికలను నిర్వహిస్తుండడం విశేషం.

## సొసైటీ డైరక్టర్ కారు అద్దం ధ్వంసం..ఫిర్యాదు




ఎదులాబాద్‌లో ధ్వంస ం చేసిన కారును పరిశీలిస్తున్న పోలీసు

**ఘట్‌కేసర్, నవంబర్ 29, ప్రభాతవార్త:**
సహకార సంఘం డైరక్టర్ కారు అద్దాలు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎదులాబాద్ గ్రామానికి చెందిన ఘట్‌కేసర్ సొసైటీ డైరక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి మంగళవారం తన స్కోడా కారు (ఏపీ13ఎల్2345)ను ఇంటి ముందు నిలిపి ఉంచాడు. కాగా బుధవారం 6 గంటలకు చూడగా కారు ముందు, వెనుక అద్దాలు ధ్వంసం చేసి ఉన్నాయి. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అద్దాలు ధ్వంసం చేశారని ధర్మారెడ్డి ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు చేరుకొని కారును పరిశీ లించి వివరాలు సేకరించారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అనుచరులు తన కారును ధ్వంసం చేసినట్లు అనుమానంగా ఉందని వాళ్లకు తనకు ప్రాణభయం ఉందని ధర్మారెడ్డి పోలీసులకు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

### - హైద్రాబాద్,బీజాపూర్ జాతీయరహదారిపై ఘటన
### -దుద్యాల్ మండలం పోలెపల్లి వాసిగా గుర్తింపు

**పూడూరు, నవంబర్ 29, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని రాకంచెర్ల సమీపంలో హైద్రాబాద్..బీజాపూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు,చెన్‌గోముల్ ఎస్ఐ గిరి కథనం ప్రకారం కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం, దుద్యాల్ మండలం పరిధిలోని పోలెపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య,పద్మమ్మ దంపతులు జీవనోపాధి నిమిత్తం హైద్రాబాద్ నగరంలో నివాసం ఉంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం తమ ఓటును ఉపయోగించుకునేందుకు భార్య,భర్తలిద్దరు బుధవారం మధ్యాహ్నం హైద్రాబాద్‌నుండి స్వగ్రామం పోలెపల్లికి స్వంత బైక్‌పై హైద్రాబాద్..బీజాపూర్ జాతీయ రహదారిపైబయలుదేరారు.అయితే పూడూరు మండలం రాకంచెర్ల,దేవనోనిగూడ శివారులోకి రాగానే మన్నెగూడ వైపునుండి పరిగి వైపు బైకు ముందు వెళుతున్న గుర్తుతెలియని బస్సుతోపాటు,ఎదురుగా వస్తున్న మరోబైక్ వల్ల జరిగిన ప్రమాదంతో పద్మమ్మ సుమారు (45) తలకు తీవ్ర గాయాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది.భర్త వెంకటయ్యకు స్వల్ప గాయాలు అయ్యాయి.స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం ఆటోలో పరిగికి తరళించగా,మెరుగైన చికిత్స కోసం వైద్యుల సిఫార్సుమేరకు హైద్రాబాద్‌కు తరళిస్తుండగా మార్గమధ్యలో పద్మమ్మ మృతి చెందింది.ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.మృతురాలి బంధువుల నుండి పిర్యాదు అందలేదని,పిర్యాదు అందిన వెంటనే పూర్తి వివరాలు తెలియజేస్తామని వివరించారు.

### అయ్యప్ప మాల ధరించిన విద్యార్థిని బయట కూర్చోబెట్టిన యాజమాన్యం



విద్యార్థి అయ్యప్ప మాలధారణ వేసుకున్నాడని బయట కూర్చొబెట్టినందుకు నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, బిజేపి నాయకులు

**కీసర,నవంబరు29,ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాంపల్లిదాయర గ్రామంలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఒక విద్యార్థి అయ్యప్ప మాలధారణ వేసుకున్నాడని పాఠశాల యాజమాన్యం స్కూల్‌లోకి రాకుండా బయట కూర్చొబెట్టిన సంఘటన బుదవారం చోటుచేసుకుంది.ఇది తెలుసుకున్న విద్యార్థి తల్లితండ్రులు,బిజేపి నాయకులు పాఠశాల గేటు ముందు నిరసన వ్యక్తం చేశారు.జూబ్లీ హిల్స్ పాఠశాల యాజయాన్యం తీరుకు నిరసన వ్యక్తం చేశారు.దీంతో పాఠశాల ముందు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.

## ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని సిద్ధం

### -కొడంగల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్



పోలింగ్ కేంద్రాలకు సామాగ్రితో తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది

**కొడంగల్ నవంబర్ 29ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కొడంగల్ నియోజకవర్గంలో 275 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అందులో 146 వెబ్ కాస్టింగ్ పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. మొత్తం ఓటర్లు 2,36,625 ఉండగా అందులో పురుషులు 1,17,303,మహిళా ఓటర్లు 1,19,310తో పాటు ఇతరులు 12 మంది ఉన్నట్లు తెలిపారు.సెక్టార్ అధికారులుగా 29 మంది,పీఓ,ఏపీఓలు 1300 మందితో పాటు ఫ్లయింగ్ స్కాడ్ 6 టీంలు,స్టాటికల్ సర్వేలైన్స్ 4 టీంలు,మైక్రో అబ్జర వ్‌ర్‌లు 90 మంది,సోలార్ కేంద్రాల బయట వెబ కాస్టింగ్ 76 ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు 36 బస్సులు,ఇతరాత్ర వాహనాల ద్వారా రవాణా సౌకర్యం కల్పించి జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.కాగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఎన్నికల సిబ్బందికి రూట్‌ల వారిగా విధులు కేటాయించారు.అనంతరం ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు సంభందించిన ఈవీఓంలు,వీవీప్యాడ్‌లతో పాటు సిబ్బందిని వారికి కేటాయించిన రూట్‌లలో వివిధ వాహనాలు,పోలీసుల భద్రత మధ్య తరలించారు.

## నేటి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

### -కట్టుదిట్టమైన భద్రత
### - వెల్లడించిన చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం

**చేవెళ్ల, నవంబర్ 29 ప్రభాతవార్త:**
సాధారణ ఎన్నికలకు సంబంధించి చేవెళ్ల నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. బుధవవారం నాడు చేవెళ్ల మండల కేంద్రంలో ఫరా ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. నియోజకవర్గంలోని 298 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రిని సిబ్బందికి అందజేశారు. మొత్తం 3500 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. గరువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబ్‌పేట్ మండలాల్లో మొత్తం 2,62,005 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 1,32,631, మహిళా ఓటర్లు 1,29,370 మంది, సర్వీస్ ఓటర్లు 74, ఇతరులు 4 ఓటర్లు ఉన్నారని రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. 298 పోలింగ్ కేంద్రాల్లో 57 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత రాజేంద్రనగర్‌లోని సెంటర్ లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రిసీవింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 2018లో జరిగిన పోలింగ్‌లో 78.69 శాతం పోలింగ్ నమోదయ్యిందని అన్నారు. చేవెళ్ల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సాధారణ ఎన్నికల పరిశీలకులు శిల్ప శర్మ సందర్శించారు.

**గట్టి బందోబస్తు ఏర్పాటు**
ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు బలగాలను సిద్ధం చేసినట్లు చేవెళ్ల ఏసిపి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఐదు మండలాల పరిధిలో ఒక డిసిపి, ఒక అదనపు డిసిపి, ముగ్గురు ఏసిపిలు, 9 మంది సిఐలు, 14 మంది ఎస్ఐలు, నలుగురు ఏఎస్ఐలు, 42 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 193 మంది హోంగార్డులు, 24 మంది ఏఆర్ కానిస్టేబుళ్ల విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్దంగా ఎవరు వ్యవహరించి నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిచారు. మద్యం, డబ్బు పంపిణీకి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘినట్లు ఫిర్యాదులు అందితే సందర్శించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



చేవెళ్ల నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సామాగ్రిని తీసుకుని పోలింగ్ స్టేషన్‌లకు చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది